# బ్రతుకు పాట

'ఏవండీ, ఏవండోయ్'

లక్ష్మీకాంతయ్య ఆశ్చర్యంగా వెనక్కితిరిగి చూశాడు. శాంత బొటన వ్రేలితో నేలను రాస్తూ మెల్లిగా తలెత్తి భర్తవైపు చూసింది.

'ఏం, ఎందుకూ?'

'అబ్బే, మరేఁవీ లేదు...ఏవిఁటంటే...' అంది శాంత తనలో తను గొణుక్కున్నట్లు

'ఏవిఁటదీ...త్వరగా తేల్చు...ధాన్యంకోసం అవతల బేరగాళ్ళు తిరుగుతున్నారు...'

లక్ష్మీకాంతయ్యలో సానుభూతికన్న అదేఁవిఁటో తెలుసుకోవాలన్న కుతూహలమే ఎక్కువగా పనిచేసింది. ఇన్ని నిమిషాలకి ఇన్ని రూపాయలు అని లెక్కగట్టే అతడు...అలా అనుకోకపోతే...ఈపాటికి అవతల వీధిమలుపు తిరిగేవాడే...

ఆ యింట్లో రెండు మాటలు అంటూ లేనేలేవు. లక్ష్మీకాంతయ్య గొంతుకతప్ప రెండోది వినిపించనే వినుపించదు. వినిపించలేదని ఒకనాడయినా మనసులో అయినా అనుకోడం ఎరగనంత వెర్రిబాగుల యిల్లాలు ఆమె. సలహాదారుగా సమభాగినిగా భర్తప్రక్క నిలబడడంకంటే వంట మనిషిగా, దాసీదానిగా జీవించడంలోనే ఆమెకు తృప్తి ఎక్కువ. చల్లగా సాఫీగా సాగుతున్న ఆమె సంసార కాసారంలో గడచినరాత్రి చిన్నరాయి పడి ఆమెలో నిద్రాణమైఉన్న రసపిపాసను లేపి కూచోబెట్టింది. ఆ రాత్రి, వేళగాని వేళ, ఏడాది దాటిన తన పాప లేచి కేరింతలు మొదలు పెట్టింది. భాష కందని సొగసులూ ఊహకందని ఊసులూ దానివి. అన్నిరకాల

పక్షులూ ఉన్న మఱ్ఱిచెట్టుక్రింది తెల్లారేసరికల్లా వినిపించే ఈలలూ, గోలలూ శాంతకు పాప ఊసుల్లో వినిపించాయి. ఆ పసిగందు కబుర్లలోని కమ్మదనానికి అంతవరకూ ఆమెలో అంతర్లీనమై ఉన్నదేదో అల్లరి చెయ్యడం ఆరంభించింది. మూడేళ్ళయి కాపురానికి వచ్చినతర్వాత ఆమె భర్తకు చెప్పకుండా మొట్టమొదటిసారి చేసినపని—లాంతరు పెద్దదిచేసి—ఆ నిశిరాత్రివేళ నిచ్చెనెక్కి— అటకెక్కి— వీణతీసి కిందకు దింపింది. దానిమీద దుమ్ముదులిపింది...అలా దాన్ని చూస్తూ కూచుంటే ఎన్నిరకాల స్మృతులని :

చిన్నప్పుడు తన పాటల సరదా......

పిన్ని కొడుక్కి తలదువ్వి బళ్ళోకిపంపి నాన్నకి కేరియరులో అన్నం సర్ది పనిమనిషికిచ్చి...పిన్ని భోంచేసినతర్వాత తనూ యింత తిని... వాదంచెట్టుకింద కూచుని హాయిగా అంట్లుతోముకుంటూ ఏ 'గజ్జలందియలు, ఘల్లు ఘల్లు మన, గంతులువేయర గోపాలా' వో అందుకునేది. 'ఏవేఁ మాధ్యాన్నం ఓ గడీ పడుకోనియ్యకుండా ఏవిఁటీ కాకిగోల ? నోరు మూస్తావా, మూయించనా ?'

'మరిచిపోయాను పిన్నీ, ఇంకెప్పుడూ పాడనులే' అనేసేది అప్పటికి. మళ్ళీ మర్నాడే మొదలు 'ఏ తీరుగ నను...' ఆ రోజుల్లో వాళ్ళ సొంతమ్మ తమ్ముడు అక్కడికి ఓసారి రావడం తనెప్పటికీ మరిచిపోలేనిది......

'ఏవేఁశాంతా, సినిమాకి ఒస్తావటే ?'

'తమ్ముణ్ణి తీసికెళ్ళు మావయ్యా' అని నవ్వేసేది తను.

'అయ్యయ్యో నవ్వేలా ఒస్తోందే నీకూ ? బావకి యింత బుద్ధిలేక పోయిందేవేఁ! పదమూడేళ్ళకే నీ బతుకు వంటపొయ్యికి అంకితవఁయి పోయిందిటే?...' అని ఓ గడీ ఊరుకుని 'చూడూ...మీ అమ్మకి మీ అమ్మమ్మ యిచ్చిన వీణ ఒకటి నా దగ్గిరుండిపోయిందే. ఇప్పుడు

పంపిస్తే ఈ రాక్షసి నిన్ను బతకనియ్యదు...రేపొద్దుట నీదన్న యింటికి నువ్వు వెడుతున్నపుడు నీకది యిస్తాలే...చూడు శాంతీ ఇలా దగ్గరగా రా అమ్మా'

అతడు శాంత తలమీద చెయ్యివేసి ఆప్యాయంగా నిమిరేడు. పై కండువాతో కళ్ళద్దుకొని చెయ్యెత్తి పైకి నమస్కారం చేశాడు. అతని మనసులో జొరబడగలిగితే దానిభావం 'నాకు నీ మీద ఉన్న సంశయాన్ని ఒకపక్కకు నెట్టి రెండు చేతులూ ఎత్తి త్రికరణశుద్ధిగా నిన్ను ప్రార్థిస్తున్నాను భగవంతుడా : దిక్కులేని ఈ ఆడపిల్లకి ఏదారి చూపిస్తావో ఆదర్శప్రాయుడూ, ఆస్తిపరుడూ, ఆజానుబాహుడూ దీనికేం అక్కర్లేదు. ఏ లక్షమందిలోనూ ఒక్కర్తికి ఉంటుంది దీనికి ఉన్నంత మంచి గొంతుక. దీని పాట విని ఆనందించ గలిగేవాడు దొరికేలా చూడు తండ్రీ' అయి వుంటుంది.

శాంత కన్నీళ్ళు తుడుచుకొంది.

ఇంకా వెనక్కి వెళ్ళదలిస్తే...ఆ రోజుల్లో...అమ్మ ఉన్నప్పుడు— ముగ్గు పెడుతున్నప్పుడు, మజ్జిగ చేస్తున్నప్పుడు, బట్టలు ఉతుకుతున్న పుడు,...అమ్మపాడే పాటలు...కూడా అయిదు నిమిషాలు వదలకుండా ఏదో ఒక సాయం చేస్తున్నప్పుడు తన హృదయంవేసే లయలూ... అంతేనా ?

ఎదురింటి పార్వతమ్మత్త ఒకరోజు సంగీతం మేష్టరు రాకపోతే 'బ్రతికేంరా భగవంతుడా' అని పొంగిపోడం 'చచ్చేంరా భగవంతుడా' అని తను మధ్య కుంగిపోడం...

ఆఖరికి ఆ మేష్టారే ఒకనాడు వాళ్ళింటికివచ్చి 'అమ్మాయికి సంగీతం చెప్పించకూడదుటండీ. చాలా తొందరగా పైకి వస్తుంది!' అనడం... లేనితనం పైకి చెప్పుకునే లేకితనంలేక అమ్మ అప్పటిమటుకు అలాగే

అనేసి పక్కకు తిరిగి కళ్ళు ఒత్తుకోడం...అంతెందుకు, ఇంటికి ఏ ముష్టివాడు వచ్చి ఏ పిచ్చిపాట పాడినా వాడికి మరిన్ని బియ్యం వేసి అప్పటి కప్పుడు ఆ పాట రాసుకుని వచ్చేదాకా నిద్రపోకపోడం...యిలా చెప్పుకుపోతే గడిచిన దినాల, పులకిత క్షణాలు ఎన్నని ;

* * * *

'మరేం, ఏం లేదు. మీరేం అనుకోరంటేనే......'

'చెప్తావా, చెప్పవా ?''

కాంత గదిలోకి వెళ్ళి వీణ తెచ్చింది. మొగుడి చేతికిచ్చింది. ''మా పుట్టింటివారు యిచ్చిన ఆస్తి ఏదేనా ఉందీ అంటే అది యిదే. ఇప్పటికే రెండుసార్లు దీని తీగెలు తెగిపోయాయి. మీకు వీలయితే కాస్త బాగు చేయించి పెట్టండి. అప్పుడప్పుడు యింట్లో కూచుని కాస్సేపు వాయించుకుంటాను'' అందామని ఆమె కోరిక. కాని భర్త ఆమెను జోరబడనియ్యలేదు. లోకంలో అధికారులముందు అమాయకుల భావాలు పైకి రాకుండా ఎలా అణగారిపోతాయో అలాగే ఆమె మాటలు ఆమెదగ్గిరే ఉండిపోయాయి.

'ఎవళ్ళో మేళాలు కట్టేవాళ్ళకీ, కచేరీలకని బరితెగించిన వాళ్ళకీ తప్ప ఇల్లు చక్కదిద్దుకునే సంసార్లకు సంగీతంతో ఏంపని ?'

ఇంగితం లేని శిలాహృదయాల్ని సహా ద్రవింప చెయ్యడమే సంగీతం సంగంతి అనే నానుడి లక్ష్మీకాంతయ్యముందు చెల్లుబడి కాలేకపోయింది.

'...నాడా దొరికిందని 'ఘోడా'ని కొనుక్కోగలమా ? ఎప్పటిదో ఇక్ష్వాకుల కాలంనాటి వీణొకటి బయటపడిందని, ఇన్నేళ్ళొచ్చి, ఇందరు పిల్లల్నికని, మేష్టర్ని ఒకణ్ణి పెట్టుకుని నెలకు పదో పాతికో తగలేద్దామనా ? ఇంత సిగ్గులేకపోయిందేమే ! ఇన్నాళ్ళు ఇది ఉందన్న మాటే

నాకు గ్యాపకం లేకపోయింది. మరో మొగాడయితే ఈ పాటికి దీన్ని ముక్కముక్కలు చేసునేమో! ఇలాంటి వస్తువుల ఉపయోగం ఏవింటో అందరికీ ఏం తెలుస్తుందిలే!'

అంతే...ఆ వీణ పట్టుకుని ఆయన అలా వెళ్ళిపోయాడు. మళ్ళీ అది ఇంటికి రాలేదు. దానిబదులు లక్ష్మీకాంతయ్య ఎడంచేతి చిటికెనవ్రేలికి మాత్రం నీలంరాయి ఉంగరం ఒకటి వచ్చింది!

మొదట్లో శాంత ఇంత పెద్ద దెబ్బను భరించలేకపోయింది. 'జలజలా ప్రవహించే సెలయేరుఅయినా, గలగలా ప్రవహించే గోదావరి అయినా సముద్రపు హోరుతో సరిపెట్టుకోవలసిందే' అనే మాటకు ఆమె ఒక పట్టాన ఒప్పుకోలేక పోయింది. అయితేనేం. ఆమెలోని ఆజన్మ సంస్కారం ఆమెను నిలబెట్టకలిగింది. తట్టుకోగలిగాననే ధైర్యం ఆమెకు బలాన్నిచ్చింది. మళ్ళీ మామూలు చిరునవ్వుతో ఆమెపనులు ఆమె చేసుకో సాగింది.

*　　　*　　　*

భాగ్యం యివ్వగలిగేడుగాని ఆమెభర్త ఆమెకు సౌభాగ్యం ప్రసాదించలేకపోయాడు. మరో రెండేళ్ళకు ఆయనదారి ఆయన చూసుకున్నాడు. కష్టసమయంలో ఆమెను ఆర్చిందీ ఓదార్చిందీ ఒకే ఒకవిషయం...పిల్లకు వర్ణాలదాకా సంగీతం చెప్పించ గలిగింది. అంతలో ఆమాత్రం సుఖం లేకుండా ఆది అత్తారింటికి వెళ్ళిపోయింది. ఓసారి అది పుట్టింటికి వచ్చి తన స్నేహితురాలితో అంటుంది.

'మా అమ్మ ఉత్తి వెర్రిదిసుమీ ఒసే, ఏదో సంగీతం అంటూ నా నా బలవంతంచేసి నాకొద్దు మొర్రో అంటూంటే నాకు నేర్పించిందా...ఇక అక్కడ మా అత్తారింట్లో చూడాలి భాగోతం...నేను 'టుంయ్' మనిపిస్తే చాలు మా మావఁగారు నామీద 'కంయ్' మని లేస్తారు! ఇక రోజల్లా

ఊరల్లా తిరిగి దీపాలు పెడితేగాని ఆ మహానుభావులు యింటిగడప తొక్కరాయె. రాత్రిపూట యిలాంటి రాగాలూ తానాలూ అంటే ఆయనకి ఒళ్ళుమంట. ఎంతవేగం లైటు ఆర్పేస్తానా అని చూస్తారు!'

సరోజా, స్నేహితురాలూ పకపక నవ్వుకున్నారు. శాంతమ్మకూడా నవ్వింది. కాని ఆమె నవ్వులో ఆమెకే అపశ్రుతి తోచింది.

* * * *

మరో పదేళ్ళకు శాంతమ్మ నాన్నమ్మ అయింది. ఉన్నఊళ్ళోనే ఉండి ప్లీడరీ చేస్తున్న మూడోకొడుకు దగ్గిర ఆమె స్థిరపడిపోయింది.

ఓనాడు...మనవడి అన్న ప్రాశననాడు...నలుగు రమ్మలక్కలూ బలవంతంచేస్తే...ఆమె 'జోఅచ్యుతానంద, జోజో ముకుందా' అన్నపాట పాడడం ఆమె జీవితాన్ని మరింత దుఃఖభాజనం చేసింది.

పేరంటాళ్ళు వెళ్ళిపోతూ అనుకున్న మాటలు కోడలు చెవినిపడ్డాయి.

'ఆ కోడలు చూశావా...మళ్ళీ మ్యూజిక్ బియ్యే ప్యాసయిందిట... ఏం లాభం? నోరిప్పితే ఆ చుట్టుపక్కల మూడుకోసుల దూరంలో ప్రాణమున్న దేదీ నిలబడలేదు...ఓ కాయు కాటిలోఉన్నా ఆ అత్తగారి కంఠస్వరం విన్నావా. పోయిన ప్రాణం లేచొస్తుంది...మంచి స్వరూపం. మధురమైన స్వరం. యిలాంటివి కొనితెచ్చుకుంటే వచ్చేవిటమ్మా?' కోడలు కామాక్షినెత్తిన పిడుగుపడింది?

* * * *

'ఏమండీ నే నొకమాట చెబుతాను, వింటారూ?'

'ఎప్పుడు వినలేదుగనుక, వినక బతికి బట్టగట్టిన మొగా దెవడుగనక?' అనుకుంటూ వాసుదేవరావు వెనక్కి తిరిగేడు. వాదించి నెగ్గడంలో కామాక్షిదగ్గిర ఇన్ని పద్ధతులున్నాయని తెలుస్తే అతను ఆవిడదగ్గిరే 'ఎప్రన్‌టిస్' అయి వుండును! ఈ మాట వింటే 'ఇప్పుడేనా మించి

పోయింది ఏముందిలే! నాదగ్గిర తర్ఫీదు అవుతూండు. జీతంగా నెలకి నీ ఆర్జన సమర్పిస్తే చాల్లే' అని వుండేది ఆమె!

'పుట్టింటివాళ్లు యిచ్చారనే బుద్ధితక్కువకొద్దీ యీ రేడియో యిన్నాళ్ళూ ఉంచుకున్నాను. చాలు, ముచ్చట తీరిపోయింది. సగం రేటయినా రాకపోదు. వెంటనే అమ్మెయ్యండి' కామాక్షి రెండుకళ్లూ గట్టిగా కొంగుతో ఒత్తుకుంది. 'ఇనేళ్లు వచ్చాయి, ఈ గూఢచారిపని ఏమయినా బాగుందా? ఎప్పుడూ నా గదిగుమ్మం అవతలేనా కాపలా?' వాసుదేవ రావు భయంగా పెళ్ళాంవైపు చూశాడు, పెళ్ళాకంటె పెద్ద చిక్కుప్రశ్న ఉంటుందా అని అతని సంశయం. 'నేను ఇలా రేడియో 'ట్యూను' చేసే సరికల్లా మీ అమ్మగారు అలా వచ్చి గుమ్మంమీద కూచుంటారు. అలా 'బేటామాను'లా ఆవిడ కూచుంటే నా ఒళ్ళుడికిపోతుంది సుమండీ. రేడియో వినాలనే ఉండదూ...ఛఛ...ఉన్న సంగతి గ్రహించి తగు కట్టుదిట్టం చేయించే జ్ఞానం యింట్లో మొగాళ్ళకు లేకపోయె......'

'ఆవిడ మొదట్నుంచీ సంగీతమంటే చెవికోసుకునే రకం. ఏ రామదాసు కీర్తనలో, ఏ రుక్మిణీకల్యాణమో వస్తుందని పాపం యిక్కడ చేరుతుంది.. నీ కంత ఇబ్బందిగాఉంటే పంటింట్లో ఆవిడకి వేరే లౌడుస్పీకరు పెట్టిస్తాను లేవే......'

'అక్కర్లేదు. ఈ రేడియోనే అక్కడ... మీ ముద్దులమ్మముందు పెట్టించండి...'

తర్వాత సంగతి ఏం జరిగేదో గాని త్యాగరాయ కృతులు విందామని ఆ పక్కగదిలో చతికిలబడిన శాంతమ్మ మళ్ళీ ఆ దరిదాపులకి రాలేదు! కామాక్షి అట్టే భయపడకుండా ఆమె స్వరం కూడా రోజురోజుకీ క్షీణించి పోయింది. పాట పాడ్డం మాట దేవుడెరుగు. గట్టిగా మాటాడితే కూడా యిప్పు డావిడకి ఆయాసం వస్తోంది. మరోమాటు గట్టిగా పిలిస్తేగాని

ఆమెకు వినపడ్డమే లేదు! అలా కూచునే నెమ్మది నెమ్మదిగా డేకి, ఇంట్లో పనులన్నీ చేసుకున్న తరువాత ... పట్టుతప్పుతున్న, పంచేంద్రియాలకూ సరిపడే ఆమెలోని 'ఆరోశక్తి'కి ఉపశమనం ఒకటే ఒకటి.

మనవణ్ణి ఒళ్ళో పడేసుకుని వాడి కళ్ళల్లోకి చూస్తూ కూచుంటుంది. ఇంచుమించు ఇద్దరిదీ ఒకే స్థితి. గొంతు ఎత్తలేక పోయినా ఆమె 'వోకలూ', 'యిన్‌స్ట్రుమెంటలూ' పాడగలదు! జవాబు చెప్పలేక పోయినా వాడు 'కాళ్ళూ చేతులా' ఆనందించగలడు! ఇద్దరూ బోక్కి నోళ్ళతో ఫక్కుమని నవ్వుకోగలరు. ఆ సంగీతంలోని 'సంగతులు' చెప్పడానికి సరిగమలు చాలవు.